

విద్యుత్ స్తంభం తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - సీతానగరం

ఈదురుగాలులకు గత శనివారం రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్థంభాన్ని ఎట్టకేలకు సంబంధిత శాఖ అధికారులు తొలగించారు. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్థంభాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 19న 'విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు' అని ప్రజాశక్తి కథనాన్ని తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బుధవారం రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాన్ని తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పునరుద్ధరించబడిన మార్గం

రేషన్ డోర్ డెలివరీకి మంగళం

- ఎండియు వాహనాలకు బ్రేక్
- జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీ
- 65 ఏళ్లు దాటిన వృద్ధులు, విలాంగులకు మాత్రమే డోర్ డెలివరీ
- 364 మంది ఎండియు ఆపరేటర్ల ఉపాధికి గండి

ఎండియు వాహనం ద్వారా రేషన్ అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

ప్రజాశక్తి - కొవ్వూరు

రేషన్ సరుకుల డోర్ డెలివరీకి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. జూన్ ఒకటో తేదీ నుంచి ఇంటింటా సరుకుల పంపిణీని నిలిపేస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఇకపై కార్డుదారులు నేరుగా రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు మాత్రమే డోర్ డెలివరీ చేయనున్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం పది నెలలుగా కొనసాగిస్తూ వచ్చింది. కూటమి సర్కారు ఏర్పడిన కొత్తలో డోర్ డెలివరీ విధానం తొలగించాలని భావించినప్పటికీ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉందని భావించి వెనక్కి తగ్గింది. జిల్లా వ్యాప్తంగా 5,79,197 రేషన్ కార్డులున్నాయి. వీటి పరిధిలో 15,68,969 మంది లబ్ధిదారులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 871 రేషన్ షాపులున్నాయి.రేషన్ డీలర్లకు కమిషన్ చెల్లిస్తూ వారి ఉపాధికి భంగం లేకుండా డోర్ డెలివరీ విధానం ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రేషన్ సరుకులు అందించేందుకు రెండు, మూడు దుకాణాలకు ఒక వ్యాన్ చొప్పున 364 వ్యాన్‌లను ఏర్పాటు చేశారు. గడిచిన ఐదున్నరేళ్ల నుంచి ప్రజలు కూడా ఈ విధానానికి అలవాటు పడ్డారు. ఇటువంటి తరుణంలో మళ్లీ ఈ విధాన్ని తొలగించి చౌక ధరల దుకాణాలను తెరపైకి తెస్తున్నట్టు సర్కారు ప్రకటించడం విమర్శలకు తావిస్తుంది. రేషన్ సరుకుల కోసం గతంలో రేషన్ దుకాణాల వద్ద జనాలు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఐదున్నరేళ్ల నుంచి ప్రజలకు ఆ కష్టాలు తప్పాయి. ఇప్పుడు డోర్ డెలివరీ వాహనాలను తొలగించడం కారణంగా మళ్లీ కార్డుదారుల కష్టాలు షరా మామూలు కానున్నాయి.

జిల్లాలో ఇలా..

- మెత్తం రేషన్ కార్డుల సంఖ్య : 5,73,197
- లబ్ధిదారుల సంఖ్య : 15,68,969
- రేషన్ సరఫరాచేసే వాహనాల సంఖ్య : 364
- రేషన్ డీలర్ల సంఖ్య : 871

జిల్లాలో 364 మంది ఎండియు ఆపరేటర్లు

కూటమి సర్కారు నిర్ణయం వల్ల జిల్లాలో 364 మంది ఎండియు ఆపరేటర్లు ఉపాధిని కోల్పోనున్నారు. వాహనదారుడే రేషన్ అందించేలా ఏర్పాటు చేసి గత సర్కారు ఉపాధి కల్పించింది. ఆటో కొనుగోలు అయ్యే ఖర్చులో 60శాతం ప్రభుత్వ సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణంగా, పది శాతం లబ్ధిదారుని వాటాగా వాహనాలను సమకూర్చారు. ఒకో యూనిట్ వలువ రూ.5,81,190గా నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా రూ.21.15 కోట్ల విలువైన వాహనాలను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించారు. బ్యాంకు రుణం 30శాతం చెల్లిస్తే తిరిగి వాహనాలను లబ్ధిదారునికే చెందేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఆటో, వ్యాన్ ఆపరేటర్‌కు ఈ విధానం ద్వారా ఉపాధి కల్పించారు. ఇందు కోం ఎండియు ఆపరేటర్‌కు నెలకు రూ.18వేలు చొప్పున వేతనం కూడా అదిస్తున్నారు. వ్యాన్ ద్వారా ఆయా వీధుల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి సరుకులు అందిస్తున్నారు. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా 364 వాహన దారులు ఉపాధిని ప్రభుత్వ ప్రశ్నార్థకంగా మార్చింది. ఈ వాహనాలు సరుకులు సరఫరా నిమిత్తం ప్రత్యేకంగా తయారు చేయించడం కారణంగా ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేదు. అలా వినియోగించుకోవాలన్నా ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఎండియు ఆపరేటర్లు తలలు పట్టుకుంటున్నారు.

ఎండియు వ్యవస్థను రద్దు చేయొద్దు

ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో ఎండియు వ్యవస్థను రద్దు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ఎండియు వ్యవస్థ కొనసాగిస్తూనే రేషన్ షాపుల వద్ద కూడా సరుకులను పంపిణీ చేయాలి. నిర్వహణ లోపాలు సరిదిద్ది ఎండియు వ్యవస్థను మరింత మెరుగు పర్చాలి. అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతో అనుసంధానం చేయాలి. ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందించడం ఎంతో సౌకర్యంగా ఉంది. వాహనం వచ్చే సమయానికి కూలి పనులకు వెళ్లిన పేదలకు తరువాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేలా ఏర్పాటు ఉండాలి తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం తగదు. అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో డిపోల వద్దే తెచ్చుకోమనడం సరి కాదు. నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తే ప్రజలందరూ వినియోగించడం వల్ల అక్రమ రవాణాను అరికట్టొచ్చు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వాహనాల డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోతుంది. డీలర్లు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రేషన్ షాపులను కిరాణా దుకాణాలుగా మారుస్తామని, కేంద్రం అందించే భారత్ ఉత్పత్తులు తక్కువ ధరకు అందిస్తామని, దీనికి కేంద్రం అనుమతిచ్చిందని ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ షాపులు నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఎండియు రద్దుపై నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం వాగ్దనం చేసినట్టుగా బియ్యంతో పాటు కందిపప్పు, నూనె, చింతపండును సరఫరా చేయాలి.

- టి.అరుణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి, తూర్పుగోదావరి జిల్లా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు

తెలుగు విశ్వవిద్యాలయాన్ని సాధించా: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చారిత్రక, సాంస్కృతిక, కళా రాజధాని రాజమంహేంద్రవరంకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాధించగలిగానని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలియచేయడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. బుధవారం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో పదేళ్ళపాటు హైదరాబాద్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఇకపై రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ 2024 ఆగస్టు 5న ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రతిపాదన పంపించానని, దీనిపై పూర్తి వివరాలు పంపించాలని ఆయన సూచించడంతో 2024 సెప్టెంబర్ 17వ తేదీన అన్ని వివరాలు అందచేసినట్లు తెలిపారు. ఆనాటి సిఎం ఎన్‌టిఆర్ ఈ విశ్వవిద్యాలయం స్థాపిస్తే, నేడు ఆయన మనవడు లోకేష్ దీనికి పూర్వ వైభవం తీసుకు రానున్నారని తెలిపారు. అలాగే బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, ఆంధ్ర మహిళా సంస్కృత కళాశాల ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. తెలుగు విశ్వ విద్యాలయం బొమ్మూరు సాహిత్య పీఠానికి 50 ఎకరాల స్థలం ఉండేదని, ఇటీవల అందులో 17 ఎకరాలకు పైగా జిపిసిఎల్, నాక్, కలెక్టర్ కార్యాలయం భవనాలకు కేటాయించారని , మిగిలిన భూమిలో విశ్వవిద్యాలయం 12 విభాగాలు ఏర్పాటు చేయడానికి సహచర ఎంఎల్ఎలు, ఎంపి, మంత్రి కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి తెలుగు విశ్వ విద్యాలయం తరలి వచ్చేందుకు ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు చేసిన కృషిని యూనివర్సిటీ ఆంధ్ర రీజియన్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ప్రొఫెసర్ నిరీక్షణ బాబు అభినందించారు.

డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో చేపట్టిన డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి, స్థాని ఎంఎల్ఎ కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో ఆయన పర్యటించారు. పట్టణంలోని బస్టాండ్‌కు వెళ్లే దారిలో 11వ వార్డు ఉజ్జినవారి వీధిలో పర్యటించిన ఆయన స్థానికంగా జరుగుతున్న మురుగునీటి కాలువ పనులను పరిశీలించారు. వార్డు ప్రజలతో స్వయంగా మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. త్వరితగతిన మురుగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరంలో చెక్కును అందిస్తున్న శేషారావు

బాధితులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, చాగల్లు

సిఎం సహాయ నిధి నుంచి బాధితులకు విడుదలైన చెక్కులను రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు స్వగృహంలో బుధవారం అందజేశారు. నియోజక వర్గంలోని నిడదవోలు అర్బన్, రూరల్ మండలాలతోపాటు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన పలువురి బాధితులకు రూ.13,05,600 విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనారోగ్యం భారిన పడి ప్రయివేటు ఆసుపత్రుల్లో అప్పులు చేసి వైద్యం పొందిన వారికి సిఎం సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కోట్లాది రూపాయలను విడుదల చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతోపాటు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే చాగల్లు మండలం చాగల్లుకి చెందిన కోడూరి ఆనంద్‌కు రూ.1,31,728, గౌరిపల్లి గ్రామానికి చెందిన గుంటి పోసమ్మకు రూ.22 వేల చెక్కులను కొవ్వూరు ఎఎంసి ఛైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి టిడిపి కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రవి, కామయ్య, శ్రీను, గద్దె వీర్రాజు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ల ఆందోళన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్, కడియం

ఎండియు ఆపరేటర్లను నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం కలెక్టరేట్ వద్ద ఎండియు ఆపరేటర్లు ధర్నా నిర్వహించారు. మరో 18 నెలల గడువు ఉన్నా తమను తొలగించడం దారుణమని ఆపరేటర్లు ఆతవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని, ఎండియు ఆపరేటర్లు ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. ఎండియు ఆపరేటర్ల ఆందోళనకు మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇష్టం వచ్చినట్లు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో 18వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. ఎండియు ఆపరేటర్ల కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కడియం రెవెన్యూ కార్యాలయం వద్ద ఎండియు ఆపరేటర్లు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లను తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒను ఉపసంహరించుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఎండియు ఆపరేటర్ల ద్వారా పిడిఎస్ బియ్యాన్ని ఇంటింటికీ సరఫరా చేసేలా నిర్ణయం తీసుకుందని, నాటి నుంచి నేటి వరకూ ఎన్నో కష్టనష్టాలను, ఒడిదుడుకులను ఓర్చుకుంటూ ఇంటింటికీ పిడిఎస్ బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 18,520 కుటుంబాలు జీవనోపాధి కోల్పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2026 డిసెంబర్ నెలాఖరు వరకూ తమకు ప్రభుత్వానికి మధ్య ఒప్పందం ఉందని, కనీసం అప్పటివరకు అయినా తమను కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు యనమదల మణికంఠ, బేధంపూడి వెంకన్న, ఓంప్రసాద్, పిల్లి సుబ్రహ్మణ్యం, జెపి, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న మాజీ ఎంపి మార్గాని

జాతీయ ఏక్‌తా శిబిరానికి ప్రసాద్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జూన్ 6 నుంచి 12 వరకూ గుజరాత్‌లో నిర్వహించనున్న జాతీయ ఏకతా శిబిరానికి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ సెకెండియర్ విద్యను అభ్యసిస్తున్న వైబి.ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె అన్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థి వైబి.ప్రసాద్‌ను ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారులు అభినందించారు.

ప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్ర

అధికారులను కలిసిన నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - కడియం

సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, ఇతర ప్రతినిధులు బుధవారం జిల్లా పరిశ్రమల అభివృద్ధి శాఖ అధికారి వాణిధర్, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ సత్యనారాయణలను మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత అధికారులకు మొక్కలు అందించే అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పోలి బ్యాగ్స్ ఫ్యాక్టరీ, ప్లాంట్స్ ప్యాకింగ్ యూనిట్స్, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఎఫ్‌పిఒ నుంచి 10 శాతం పెట్టుబడితో 90 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితి వచ్చే విధానాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, రత్నం బాబ్జి, పాఠంశెట్టి శేషుకుమార్, గాదా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారికి మొక్కను ఇస్తున్న రత్నం అయ్యప్ప

నందిగంపాడు పంచాయతీకి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - చాగల్లు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సక్రమ నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా ప్రతిస్పందన సర్వేలో నందిగంపాడు గ్రామపంచాయతీ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవిఆర్‌ఎస్ సర్వేలో మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుచున్నదా? అన్న ప్రశ్నకు వంద శాతం, వారానికి కనీసం రెండుసార్లు పైబడి మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా? అను ప్రశ్నకు వందశాతం ఆమోదం వచ్చింది. మండలంలోని చాగల్లు, దారవరం, నెలటూరు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, మల్లవరం గ్రామ పంచాయతీలు చెత్త సంపద కేంద్రాల పనితీరులో కొవ్వూరు డివిజన్లో చాగల్లు మండలానికి ద్వితీయస్థానం లభించింది. ఈ సందర్భంగా నందిగంపాడు పంచాయతి కార్యదర్శి వి.శిరీషరాణిని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణకుమార్ శాలువాలతో సత్కరించారు.

కార్యదర్శి శిరీషారాణిని సత్కరిస్తున్న అధికారులు

కలెక్టర్ ప్రశాంతిని కలిసిన చక్రధర్

నాబార్డ్ డిడిఎంగా చక్రధర్ రావూరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా నాబార్డ్ జిల్లా అభివృధి మేనేజర్ (డిడిఎం)గా చక్రధర్ రావూరి కొత్తగా పదవీ బాధ్యతల్ని స్వీకరించారు. గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేసిన చక్రధర్ బదిలీపై జిల్లాకు వచ్చారు. బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తాడిమళ్ళ మాజీ ఎంపిటిసి గొల్లపల్లి నారాయణ కుటుంబాన్ని టిడిపి నాయకులు పరామర్శించారు. ఇటీవల కాలంలో నారాయణ మృతి చెందారు. దీంతో బుధవారం టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, నీటి సంఘం డిస్టిబుటర్ కమిటీ అధ్యక్షులు కొప్పుల శ్రీనివాస్, గ్రామ టిడిపి అధ్యక్షులు కోరసిక వెంకటేశ్వరరావు, డేగల శ్రీనివాస్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

కార్టూ'నిజం'



ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

-వేసవి వేళ అప్రమత్తత తప్పనిసరి
-కనిపించని హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

వేసవి సెలవుల్లో సరదాగా కాలువల్లోనూ, గోదావరి పాయల్లో యువత స్థానానికి వెళ్లి ఈత రాక ప్రమాదవశాత్తు గల్లంతైయి ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. దీంతో తమ బిడ్డలు వేసవి సెలవుల్లో ఇళ్లకు వచ్చారన్నా సంతోషం కాస్త ఆవిరి అయిపోయి విషాదం అలుముకుంటుంది. గత నాలుగైదు సంవత్సరాలుగా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో ఈతకు వెళ్లిన విద్యార్థులు ప్రమాదవశాత్తు కాలువలో గల్లంతై ఊపిరి ఆడక మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నెల 19వ తేదీన చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన గాడి రాకేష్ (17) సీతంపేట ఆనకట్ట వద్ద గోదావరి స్థానానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి మృత్యువాతపడ్డాడు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీన విజ్జేశ్వరం లాకులకు దిగువున చిగుర్లంక నిడదవోలు చర్చిపేటకు చెందిన మరిది ప్రకాష్‌కుమార్(15), రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష (18), మరో యువకుడు స్నానం చేసేందుకు చిగుర్లంక గోదావరి పాయలో స్నానాలు ఆచరిస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యారు. వారిలో ఇద్దరు గోదావరిలో గల్లంతయ్యారు. ఒక యువకుడిని స్థానికులు కాపాడారు. ఇదే ప్రదేశంలో రెండేళ్ల క్రితం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన అక్క చెల్లెలు స్నానానికి దిగి మృతి చెందారు. ఇలా అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

గోదావరిలో గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి కందుల(ఫైల్ ఫొటో)

హెచ్చరిక బోర్డులు కరువు

కాలువల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు కరువయ్యాయి. సాధారణంగా ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించడానికి, ప్రజలను హెచ్చరించడంతోపాటు, ప్రమాదాలను నివారించడానికి హెచ్చరిక బోర్డులు తప్పనిసరి. అయితే సంబంధిత శాఖ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల ప్రాణాలను కాపాడేలా గుర్తించిన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - చాగల్లు

మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించాఉరు. బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బొనిగే రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిక్షా కార్మికులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు

'పది' సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో బుధవారం జరిగని పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 18 పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. మొత్తం 904 విద్యార్థులకు గాను హిందీ పరీక్షకు 486 మంది విద్యార్థులు హాజరయ్యారుఉ.ఇంగ్లీష్ పేపర్ పరీక్ష 28 పరీక్షా కేంద్రాలలోను ప్రశాంతంగా జరిగాయి. ఓపెన్ స్కూల్ పదవ తరగతి అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా తెలుగు పరీక్షకు 235 విద్యార్థులకు గాను 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటెర్మీడియట్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా రసాయన, ఆర్థిక శాస్త్రం పరీక్షలు జరిగాయి. మొత్తం 384 విద్యార్థులకు గాను 253 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు.

అకాల వర్షం... అన్నదాతల కలవరం

- జిల్లాలో ఇంకా పూర్తి కాని ధాన్యం కొనుగోళ్లు
- టార్గెట్‌లు పూర్తయ్యాయంటూ చేతులెత్తేస్తున్న అధికారులు
- నిడదవోలు నియోజకవర్గంలో ఇంకా 23వేల మెట్రిక్ టన్నుల నిల్వలు
- అధికారిక లెక్కల ప్రకారం 14వేల టన్నులు రైతుల వద్దే

ధాన్యాన్ని బస్తాలో నింపుతున్న రైతులు, కూలీలు

ప్రజాశక్తి - కొవ్వూరు

అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒకవైపు జిల్లాలో కొంత మంది రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. మరోపక్క ధాన్యం కొనుగోళ్లు పూర్తికాక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఇంకా 14వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. గత ఖరీఫ్ సీజన్‌లోనూ రైతులు ఇదే రకమైన పరిస్థితిని ఎదుర్కొన్నారు. సేకరణ లక్ష్యం పూర్తయ్యిందని జిల్లా వ్యాప్తంగా 32వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నాడు ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే విక్రయించుకున్నారు. ఈ రబీ సీజన్‌లోనూ అదే రకమైన పరిస్థితి ఎదుర్కొనే అవకాశం కనిపిస్తుంది. గడిచిన వారం రోజుల్లో నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు సైతం నిర్వహించారు. అయినప్పటికీ ఇంత వరకూ ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆందోళనల నేపథ్యంలో ధాన్యాన్ని రోడ్డుపై లేకుండా మిల్లులకు తరలించి చేతులు దులిపేసుకున్నారు. నేటికీ మిల్లుల వద్ద ధాన్యం అలాగే ఉంది. తాత్కాలికంగా శాంతిపంజేసేందుక ధాన్యాన్ని మిల్లులకు తరలించారనే విమర్శలున్నాయి.

ఈ-క్రాప్ నమోదు ద్వారా జిల్లాలో వరి పంట ఎన్ని ఎకరాల్లో సాగవుతుంది, ఎంత దిగుబడి వస్తుందన్న వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. అయితే ప్రభుత్వ సరైన చర్యలు తీసుకోకపోవడంతో కొనుగోళ్లు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక ప్రయివేటు వ్యక్తులకు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకుంటున్నారు. క్వింటాకు రూ.300 నుంచి రూ.400 చొప్పున ధర కోల్పోతున్నారు. ఈ లెక్కన ఎకరాకు ఒక్కో రైతుకి రూ.20వేల వరకూ నష్టపోతున్నారు.

ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో అధికారులు 5.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా 5.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. దీనిలో 3.45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం పెట్టుకుని ఇంత వరకూ 3.32 మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేశారు. మొదట్లో 2.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి దఫదఫాలుగా 2.80, 3.30, 3.40, 3.45 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచింది.

వాతావరణ హెచ్చరికలతో బెంబేలు

జిల్లా వ్యాప్తంగా రబీ వరి కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మాత్రం పూర్తి కాలేదు. ఈ తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మరోపక్క నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరించడంతో రానున్న వారం రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. బుధ, గురువారం భారీ వర్షం కురిసే అవకాశం ఉందని సూచిస్తుంది. గంటకు 30 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ఈదురు గాలులు వీస్తే వరి రైతులే కాకుండా అరటి, కొబ్బరి, మామిడి, మొక్కజొన్న, కూరగాయల రైతులు సైతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గడిచిన మూడు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తుంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలు వివరాలు (20వ తేదీ నాటికి)

మొత్తం దిగుబడి : 5.40 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు లక్ష్యం : 3.45 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసిన ధాన్యం : 3,34,058.72 మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాల సంఖ్య : 216
రైతులకు చెల్లించాల్సిన మొత్తం : రూ.769.03 కోట్లు
ఇంత వరకూ చెల్లించిన మొత్తం : రూ.603.67 కోట్లు
రైతులకు చెల్లించాల్సి బకాయిలు : రూ.165.36 కోట్లు

ఆందోళనలను పట్టించుకోని సర్కారు

ఈ నెల 5న నిడదవోలులో ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చేశారు. తర్వాత రోజు మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో సమావేశం ఏర్పాటు చేసి పదివేల టన్నులు అదనంగా కొనుగోలు చేయనున్నట్టు ప్రకటించారు. కాని ఇంత వరకూ ఈ ప్రక్రియ పూర్తికాలేదు. నిడదవోలులో 63,268 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తే 52,240 మెట్రిక్ టన్నులు, ఉండ్రాజవరంలో 43,416 మెట్రికట్ టన్నుల దిగుబడికి 32,981 మెట్రిక్ టన్నులు చొప్పున కొనుగోలు చేశారు. నిడదవోలు నియోజకవర్గం పరిధిలోనే 23వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. 12వ తేదీన కొవ్వూరులో రైతులు జాతీయ రహదారిని ముట్టడించారు. దీంతో 1,500 మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కొవ్వూరులో 40,267 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తే దీనిలో ఇంత వరకూ 33,263 టన్నులు కొనుగోలు చేశారు. 15న చాగల్లులో రైతుల వద్ద ఉన్న ధాన్యం అంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలిన డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో నిడదవోలు-చాగల్లు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. చాగల్లులో 30,018 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే దీనిలో 25వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఆరువేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్టు రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. వరుసగా ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతులు గోడు పట్టించుకోకపోవడం గమనార్హం. సీతానగరం మండలంలో 40,330కి 16,902 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇలా ప్రతి మండలంలోనూ రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

బకాయిలు చెల్లించేదెప్పుడు?

జిల్లా వ్యాప్తంగా ఉన్న 216 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. వీటికి సంబంధించి సుమారు రూ.769 కోట్లను చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకూ రూ.603.67 కోట్లను చెల్లించారు. ఇంకా రైతులకు రూ.165.36 కోట్లను చెల్లించాల్సి ఉంది.

నేరాలు ఘోరాలు

వివరాలను వెల్లడిస్తున్న సిఐ దొర రాజు

నకిలీ నోట్ల కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నకిలీ నోట్ల చెలామణి చేస్తున్న కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అంగర పోలీస్ స్టేషన్‌లో నిందితులను బుధవారం మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మండపేట రూరల్ సిఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ మీడియాకు వెల్లడించారు. మంగళవారం అంగర రైస్ మిల్ ఎదురుగా వున్న బడ్డీ కొట్టులో రాజమహేంద్రవరానికి చెందిన మన్యం వీరవెంకటసత్యసీతారామారావు రూ.500 నోట్ ఇచ్చి సిగరెట్ పెట్టి కొనుగోలు చేశాడు. అతను ఇచ్చిన నోటు నకిలీదిగా షాపు యజమాని కశెట్టి సత్యనారాయణ గుర్తించాడు. స్థానికులు సహాయంతో నిందితుడు సీతారామారావును పట్టుకొని అంగర పోలీసులకు అప్పగించారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో విజయవాడలోని మరో నిందితుడు వారా నవీన్‌ను పట్టుకున్నారు. అతని నుంచి 44 నకిలీ రూ.500 నోట్లను, ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, 17 ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్లు, పెన్ డ్రైవ్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - రాజానగరం

కంటి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్తున్న ఒక మహిళను కారు ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన రాజానగరంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కలవచర్ల గ్రామానికి చెందిన యర్రా మాణిక్యం నేత్ర వైద్య పరీక్షల కోసం బుధవారం జిఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లింది. అక్కడ ఆసుపత్రి ఎదురుగా రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మాణిక్యం(54) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దీనిపై ఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలో అవిడి రేవు సమీపంలోని పంట కాలువ వంతెన పక్కన గల లాకులు వద్ద ఒక వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అవిడి పెదపేటకు చెందిన నామాడి సుధాకర్ అలియాస్ బుజ్జి(40)గా గుర్తించారు. బుజ్జి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసుకలు ఫిర్యాదు చేశారు. కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అయితపూడిలో భారీ చోరీ

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని అయితపూడిలో ప్రముఖ వ్యాపారవేత్త కొల్లు వెంకటేశ్వరరావు ఇంట్లో భారీ చోరీ చోటు చేసుకుంది. సుమారు 140 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు వెంకటేశ్వరరావు కుటుంబం ఈ నెల 14న తిరుపతికి వెళ్లింది. తిరిగి మంగళవారం ఇంటికి చేరుకుంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటాన్ని గుర్తించారు. ఆభరణాలను చోరీకి గురైనట్టు తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. అలాగే ఎఎస్‌పి దేవరాజ్ పాటిల్‌మనీష్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ఘటనపై స్థానికులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఇంటి విడిచి దూర ప్రాంతాలకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట సిఐ కృష్ణచైతన్య సిబ్బంది ఉన్నారు.

బైకు పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

బైకు అదుపుతప్పడంతో కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మురారి గ్రామ శివారు జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు తెలిసిన వివరాల మేరకు గండేపల్లి గ్రామానికి చెందిన షేక్ నాగూర్(57) గైట్ కళాశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా బుధవారం ఇంటి నుంచి బైకుపై గైట్ కళాశాలకు బయలుదేరాడు. మురారి గ్రామ శివారు వద్ద వర్షం కురవడంతో బైకు అదుపు తప్పింది. దీంతో అతను రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే ఆయన్ని రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు. అప్పటికే నాగూర్ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఒకటో నెంబర్ ప్లాట్ ఫామ్ శివారున బుధవారం సాయంత్రం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. అతని వయస్సు 65 ఏళ్లు ఉండొచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుని శరీరంపై నీలం రంగు గళ్ల లుంగీ, నీలం, తెలుపు రంగు గళ్ల చొక్కా ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ పి.అప్పారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. వివరాలకు 93472 37683 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జిఒ 4పై పునరాలోచన చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఒల సంఘం నేతలు

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్ 4పై పునరాలోచన చేయాలని విఆర్‌ఒల సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్‌కు సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఒ సంఘ నాయకులు మాట్లాడుతూ ఒక సచివాలయానికి ఒకే విఆర్‌ఒ ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 2019కి ముందున్న రెవెన్యూ క్లస్టర్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక రెవెన్యూ విలేజ్‌కి ఒక విఆర్‌ఒ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విఆర్‌ఒలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టాభి కుటుంబానికి చందన పరామర్శ

ప్రజాశక్తి - కడియం

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

పితృవియోగంతో బాధ పడుతున్న వైసిపి నాయకుడు శాకా పట్టాభి కుటుంబాన్ని రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చందన నాగేశ్వరావు పరామర్శించారు. బుధవారం కడియంలోని పట్టాభి స్వగృహం చేరుకున్న చందన శాకా సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. శాకా కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఘనంగా యోగాంధ్రా ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

యోగాంధ్రా ప్రారంభ సభలో మాట్లాడుతున్న కందుల

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21 నుంచి నెల రోజులపాటు అధికారికంగా యోగా మాసంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ప్రారంభం అయింది. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని గోదావరి ఒడ్డున గల గౌతమీ ఘాట్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి నరసింహకిషోర్, సంయుక్త కలెక్టర్ చిన్నరాముడు, నగర కమిషనర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ సీతారామమూర్తి, అదనపు ఎస్‌పి మురళీకృష్ణ, ఆర్‌డిఒ నాయక్, డిఎస్‌పి భవ్య కిషోర్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి, జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండ, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఇఒపిఆర్‌డి ఆర్.శ్రవణ్‌కుమార్, ఎంఇఒలు గురునాథం, సుభాకర్, హౌసింగ్ ఎఇ సుబ్బరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతీ, తదితరులు పాల్గొన్నారు. **నల్లజెర్ల** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం ఎంపిడిఒ సింహాద్రిరావు అధ్యక్షతన జరిగింది. అనంతరము స్థానిక బస్‌స్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించి యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వి.ఎన్.నాయుడు, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గంగాధరరావు, ఎంఇఒలు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **తాళ్లపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్రా కార్యక్రమం ఎంపిడిఒ రమణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి జ్వాల వెంకటేశ్వరరావు, ఎస్ఐ టి.రామకృష్ణ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హారికాగుప్తా, పిఇటిలు పాల్గొన్నారు. **నిడదవోలు** స్థానికరైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.కృష్ణవేణి,

రేషన్ దుకాణం పరిశీలన

ప్రజాశక్తి - ఐ.పోలవరం

జి.మూలపొలం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న యర్రగరువు గ్రామంలో రేషన్ షాప్ ను వైసిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ షాప్ నిర్వహిస్తున్న జగడం సత్తిబాబును బుధవారం వైసిపి జిల్లా జనరల్ సెక్రటరీ రేవు అప్పారావు ఆధ్వర్యంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ కాశి షర్మిల, 5వ వార్డు పంచాయతీ మెంబర్ రేవు మంగాదేవి సమక్షంలో రేషన్ డీలను ప్రశ్నించారు. రేషన్ సరుకులు ఇచ్చే విధానం గురించి డీలర్ సత్తిబాబును అడిగి తెలుసుకున్నారు. సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ ఇస్తామన్నార. మిగతా రోజులలో బయోమెట్రిక్ మిషన్ పనిచేయదని అన్నారు. రేవు అప్పారావు మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి, వృద్ధులు, వికలాంగులకు, అనారోగ్యం ఉన్న వారికి రేషన్ సరుకులు ఇంటికి సరఫరా చేయాలన్నారు. రేషన్ పంపిణీ డోర్ డెలివరీ చేస్తున్న వాహనాలను జూన్ 1వ తేదీ నుంచి నిలుపుదల చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రకటించారన్నారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఉన్న ఫలంగా రేషన్ వెహికల్ రద్దు చేయడం సమంజసం కాదని ఆయన అన్నారు. అనంతరం వినతిపత్రాన్ని రేషన్ డీలర్ కు అందజేసి, పై అధికారులకు తెలియజేయాలన్నారు. వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వాకపల్లి వెంకట్రావు, వడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

23న జరిగే మినీ మహానాడును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కోరుకొండ

మహానాడులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వాసు

ఈ నెల 23న జరిగే రాజమహేంద్రవరం పార్లమెంటు స్థాయి మినీ మహా నాడును జయప్రదం చేయాలని ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు పిలుపు నిచ్చారు. రాజానగరం నియోజకవర్గ మినీ మహానాడు మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టిడిపి జెండా మోసిన పార్టీ శ్రేణులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. పార్టీకి సేవలు అందించిన ప్రతీ కార్యకర్తకు గౌరవం దక్కుతుందని, ఓర్పు వహించాలని కూటమిలో ఉన్న బిజెపి, జనసేనతో సర్దుకుపోవాలని ఆయన సూచిం చారు. రుడా ఛైర్మన్, నియోజవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకంలో రైతులకు నష్టపరిహారం, ఈనాం భూములు, 22ఏ లో చేర్చిన భూముల సమస్య పరిష్కారం కోసం తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కంటే కేశవరావు, అడపా వీరబాబు, నూనె వెంకన్న పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌కి 12 నుంచి అడ్మిషన్లు

ప్రజాశక్తి-కొవ్వూరు

బిల్ అండ్ షారోన్ పాక్స్ టన్ చిల్డ్రన్స్ హోమ్‌లో ప్రవేశానికి జూన్ 12వ తేదీ నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఎ.విశ్వేశ్వరరావు తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి చదువుకోవాలనే ఆసక్తి ఉన్న పేద విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నామన్నారు. తమ హోమ్‌లో విద్యార్థులకు ఉచిత భోజనంతో పాటు వసతి కల్పిస్తామన్నారు. పిల్లలను మంచి మార్గంలో చక్కటి పౌరులుగా తీర్చి దిద్దేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. వివరాలకు 944011 3527 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

యువశక్తి సేవలు అభినందనీయం

రాజోలు : ఆపదలోవున్న పేదలకు ఆర్థికంగా సాయం చేసి ఆదుకునే గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ సేవలు అభినందనీయమని నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు. కొంతకాలంగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్న సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన రాచపల్లి దుర్గాప్రసాద్ కు గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ రూ.20 వేల సమకూర్చింది. రాజోలు ఎంపిపి కేతా శ్రీను, మాజీ నెడ్ కాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ ఈ మొత్తాన్ని బుధవారం అందజేశారు.

పంటబోదెలో పూడిక తొలగించేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

సాగునీటి కాలువల పరిధిలో పంటబోదె పూడిక తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. మండలానికి చెందిన కాలువ నుంచి సూర్యారావుపేట వెళ్లే పంటబోదెను మండల కూటమి నాయకులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ డ్రెయినేజీని గాని, పంట బోదెలు గాని వ్యర్థ పదార్థాలతో పాడు చేయవద్దన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ వ్యర్థపదార్థాలు, ప్లాస్టిక్‌లతో కాలువలు, డ్రెయినేజీలు, కల్వర్టులు మూసుకుపోతాయని తెలిపారు. అంతేకాకుండా వీటి ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురి అవుతారన్నారు. అలాగే రైతులు తమ పంటల సాగులో ఈ వ్యర్థాలు కలవడంతో భారీగా నష్టపోతారన్నారు. దీనిపై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉంటూ శుభ్రతకు సహకరించాలన్నారు. మండలంలో ప్రతి గ్రామ పరిధిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

CHANGE OF NAME

I, MOHAMMAD SOFIYA KHAN, W/o Mohammad Azeem Khan and Residing at D.No.7-13-5, Pentu Saheb Street, Nidadavole, E.G.Dist., I have Changed my name from **SHAIK SOFIYA (OLD NAME)** to **MOHAMMAD SOFIYA KHAN (NEW NAME).** Henceforth I am being called as **MOHAMMAD SOFIYA KHAN** for all purposes.

పాస్‌పోర్ట్ పడిపోయినది

మాకే కుమారి, భర్త: మత్స విష్ణువు, టి చల్లపల్లి, పరపేట వాసిని. ది 17-05-2025న నేను నా **పాస్‌పోర్ట్ నెం. పి 6293291** గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. వెంటనే పాస్‌పోర్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

మాకే కుమారి, భర్త: మత్స విష్ణువు,
డోర్ నెం.3-8, పర పేట,
టి చల్లపల్లి, ఉప్పలగుప్తం మండలం,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.81436 80616

ప్రకటన

కీ॥శే॥ కేశనకుర్తి రాజేష్ (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, ఏ.వేమవరం గ్రామ కాపురస్తులు కేశనకుర్తి లక్ష్మణరావు, S/o. వెంకటేశ్వరరావు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా సోదరుడు **కేశనకుర్తి రాజేష్,** S/o. వెంకటేశ్వరరావు, ఏ.వేమవరం గ్రామంలో మా ఇంటి వద్ద 24-10-2023 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఏ.వేమవరం గ్రామపంచాయితీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: కేశనకుర్తి లక్ష్మణరావు
S/o. వెంకటేశ్వరరావు, ఏ.వేమవరం,
అమలాపురం మండలం
సెల్: 9032466452

బహిరంగ పత్రికా ప్రకటన

మా క్లయింట్ అనగా **Smt. Y.S.V.Satyaveni,** W/o. BPT A Prasad, R/o. D.No. 3-44, Chollangi Village Tallarevu Mandal, East Godavari District అనువారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా:

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మా క్లయింట్ 02-11-2005 సంవత్సరం తేదీన **అయినాల వెంకట రమణ** అనువారి వద్ద రిజిస్టర్ క్రయ దస్తావేజు రీత్యా క్రయం పొంది స్వాధీనం పొంది యున్నారు. సదరు ఆస్తిని **అయినాల వెంకట రమణ అనువారు భేరి నాగేశ్వరరావు** గారి వద్ద నుండి రిజిస్టర్ దస్తావేజు రీత్యా క్రయం పొందియున్నారు. సదరు **భేరి నాగేశ్వరరావు అనువారు రిజిస్టర్ క్రయ దస్తావేజు రీత్యా శ్రీమతి కలగర సూర్యకాంతం** గారి వద్ద క్రయం పొంది యున్నారు.

మా క్లయింట్ ను నష్ట పరచాలనే ఉద్దేశ్యంతో మరియు ఆస్తిని కాజేయలనే ఉద్దేశ్యంతో భేరి నాగేశ్వరరావు మరియు బోనం వెంకట నరసింహారావు అను వారలు లాలూచి పడి యీ దిగువ షెడ్యూల్ ఆస్తికి అక్రమ దస్తావేజులు తయారు చేసి, బోనం వెంకట నరసింహారావు అనువారు సదరు అక్రమ దస్తావేజుతో ఆస్తిపై తన హక్కు నిర్ధారించమని మరియు నా దస్తావేజును రద్దు చేయమని మహారాజశ్రీ కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు O.S. No. 271/2005 నంబరున దావా దాఖలు చేయగా సదరు దావాను శ్రీ కోర్టు వారు విచారణ జరిపి ది.27-09-2016 న సదరు దావాను డిస్మిస్ చేస్తో నా దస్తావేజు చెల్లుతుందని తీర్పు యిచ్చినారు. అందుపై బోనం వెంకట నరసింహారావు మహారాజశ్రీ కొవ్వూరు తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు అప్పీలు A.S.No. 90/2016 నంబరున దాఖలు చేయగా సదరు అప్పీలు విచారించి శ్రీ కోర్టు వారు ది. 26-12-2024 నాడు క్రింది కోర్టు వారి తీర్పుని కాయపారుస్తూ అప్పీలు కొట్టివేసినారు. క్రింది కోర్టు వారి ఖర్చులు మరియు అప్పీలు కోర్టు వారి ఖర్చులు నాకు చెలయించమని తీర్పు చెప్పి యున్నారు. అదే విధంగా బోనం వెంకట నరసింహారావు మరియు చెలంకూరి భావన్నారాయన కలసి లాలూచి పడి నాపై దాఖలు చేసిన A.T.C.No. 31/2005 ను కూడా ది. 30-09-2009 న డిస్మిస్ చేసియున్నారు.

బోనం వెంకట నరసింహారావు అనువారు పై జరిగిన విషయములు, మరియు కోర్టు తీర్పులు మరుగు పరచి ఈ దిగువ షెడ్యూల్ దాఖల భూమిని అక్రమ లభ్యం పొందే ఉద్దేశ్యముతో తప్పుడు దస్తావేజులు సృష్టించుటకు మరియు ప్రజలను మోసగించుటకు ప్రయత్నం చేస్తున్నట్టు నా క్లయింట్ నకు తెలియ వచ్చినది. కనుక యావన్మంది ప్రజలుకు తెలియ చేయునది ఏమనగా యీ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తి నా క్లయింట్ యొక్క స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నదని మరియు అందుపై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరిపినను అవి నా క్లయింట్‌ను ఏవిధంగానూ Bind చేయవని మరియు యీ దిగువ షెడ్యూల్ ఆస్తి విషయమై నిజాలు ప్రజలకు తెలియ చేయాలనే ఉద్దేశ్యంతో మరియు ప్రజలు నష్టపోకూడదని యీ ప్రకటన జారీ చేయడమయినది.

PROPERTY SCHEDULE

West Godavari District (Now East Godavari District), Kovvur Mandal, Kovvur Sub-Registry, in Dommeru Grama Panchayathi Board, Dommeru Village, 4th ward, near Door No.4-25, Zeroyathi Dry R.S.No.508 full extent of Ac.6.44 cents in it southern side Ac..095 cents equivalent to 4598 square yards vacant site bounded on:-

EAST: Land of Kalagara Radha Krishna Prasad, **SOUTH:** Land of Kalagara Hanumantha Rao. **WEST:** Land of Pendyala Narendranadh Chowdary. **NORTH:** Remaining land of Bonam Venkata Narasimha Rao in the same survey number.

Within the above said boundaries an extent of 4,598 square yards of vacant residential site with all its easementary and necessity rights.

Kovvur
21-05-2025

IV RAMANA MURTHY,
PVS S SARMA,
Advocates, Kovvur-534 350.